సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పోచంపల్లి పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతా

● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : పోచంపల్లి పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టూరిజం భవనంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగ్ పనులు, చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం పెద్ద చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేసి ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు, బతుకమ్మ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేస్తామన్నారు. భూదాన్ పోచంపల్లిని పర్యాటక ప్రాంతంగా మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రామానంద తీర్థ గ్రామీణ సంస్థను స్కిల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. జలాల్‌పూర్‌లోని లేక్‌వ్యూ పార్కు సమీపంలోని చెరువులో చిన్న బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తాసీల్దార్ వీరాబాయ్, ఎంపీడీఓ బాలశంకర్, కౌన్సిలర్లు మల్లారెడ్డి, కుమార్, భానుమతి, రజిత, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. కాగా, అధికారికంగా నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావడంతో ప్రభుత్వ అధికారులు ఆశ్చర్యపోయారు .

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : మండలంలోని అనాజీపురం గ్రామానికి చెందిన పన్నాల వెంకట్‌రెడ్డికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం అందజేశారు. పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : ఉపాధ్యాయులు చెప్పేది సరిగా ఆలకించి చదువు మీద శ్రద్ధ కనబరుచాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి విద్యార్థులకు సూచించారు. సేవా భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ బాదం పాలు అందజేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ఏండ్లుగా అమ్మానాన్న ఫౌండేషన్ తరపున వృద్ధులను, మానసిక దివ్యాంగులను చేరదీసి సేవలందిస్తూ రెండు సంవత్సరాలుగా సేవా భారత్ పేరిట పాఠశాల విద్యార్థులకు పోషక విలువలు ఉన్న బాదం మిల్క్ అందించడం అభినందనీయమన్నారు. మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకొని సేవలందించాలని సూచించారు. చక్కని ఆరోగ్యం, విద్య అందిస్తే చక్కని సమాజం తయారవుతుందని, పిల్లలకు అందించే సేవలు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇస్తాయని తెలిపారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా విని ఉన్నత స్థానాలకు ఎదుగాలని విద్యార్థులకు సూచించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవలందిస్తున్న సేవా భారత్ సంస్థ అధ్యక్షుడు శంకర్ అభినందనీయులన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని సూచించారు.

సేవా భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు గట్టు శంకర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు పాఠశాలల విద్యార్థులకు బాదం పాలు అందిస్తున్నామని, అవసరమున్న బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ కె.నారాయణరెడ్డి, కౌన్సిలర్ నాయిని అరుణాపూర్ణచందర్, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఆండాలు, ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, సేవా భారత్ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలి

● కలెక్టర్‌కు ఐద్వా వినతి

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : ఉపాధి హామీ పని దినాలను వంద నుంచి రెండు వందలకు పెంచాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ కోరారు. ఈ మేరకు కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పని దినాలను రెండు వందలకు పెంచి కూలి ఆరు వందల రూపాయలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీని పట్టణాలకు విస్తరింపజేయాలని, పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అభయ హస్తం డబ్బులను వాపస్ ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, పట్టణ ఉపాధ్యక్షురాలు మాయ రాణి, పట్టణ నాయకురాలు, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం స్వామి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 6 : కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీధరన్ సహకారంతో మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు స్వామి మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, వెంకటనర్సింహ, షమీమ్, శిరీష, వెంకటేశం, కలీమ్, లక్ష్మణ్, విజయ పాల్గొన్నారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

వలిగొండ, ఫిబ్రవరి 6 : గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన రేగు రామనర్సు (55) మండల కేంద్రంలో మోటర్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్న రామనర్సు మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి మోటర్ సైకిల్‌పై బయల్దేరాడు. ఉదయం వలిగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి రైలు ఢీకొని మృతిచెందినట్లు నిర్ధారించారు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గౌడ భవనం ఆధునీకరణకు రూ.10 లక్షలు

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6 : గౌడ కుల స్తుల భవనం ఆధునీకరణకు త్వరలో రూ.10 లక్షలు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 4వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ లైన్, రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం యాదగిరిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌ను సన్మానించి, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మేడబోయిన కాటం రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు సీస విజయలక్ష్మి, గొలికారు అరుణ, నాయకులు వాణి, మల్లేశ్, అనిల్, మౌనిక, సరోజ, భిక్షపతి, సయ్యద్ బాబా, పెంటయ్య పాల్గొన్నారు.

గుండాల ఎంపీఓ జనార్దన్‌రెడ్డి సస్పెన్షన్

గుండాల, ఫిబ్రవరి 6 : మండల పంచాయతీ అధికారి పైళ్ల జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా పంచాయతీ కార్యదర్శులను వేధిస్తున్నారన్న అభియోగాలపై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేసి నివేదిక అందజేయగా.. విధుల నుంచి తప్పించారు. సస్పెన్షన్ కాలంలో మండల హెడ్ క్వార్టర్ దాటి వెళ్లకూడదని జనార్దన్‌రెడ్డిని ఆదేశించారు. గతంలో ఇవే ఆరోపణలపై నాటి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జనార్దన్‌రెడ్డిని కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్‌కు అటాచ్ చేశారు.

బీఆర్ఎస్‌కు డీఎల్‌డీఏ చైర్మన్ పిచ్చిరెడ్డి రాజీనామా

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 6 : ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతోపాటు మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి భిక్షం, బీసీ, ఎస్సీ విభాగాల మండల ప్రధాన కార్యదర్శులు బాషబోయిన లింగం, ఉప్పల నర్సింహ కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

విద్యార్థి, యువజన సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : విద్యార్థులు, యువజనుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేశ్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ బీబీనగర్ ఎయిమ్స్‌లో, యాదాద్రి దేవస్థానంలో, జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని, డ్రగ్స్, గంజాయిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వస్తుపుల అభిలాశ్, ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యాదాద్రి దేవస్థానం నిధులతో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని, టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ముట్టడి సందర్భంగా పోలీసులు, విద్యార్థి, యువజన నాయకుల మధ్య తోపులాట జరిగింది.

అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎండీ నయీం, సుద్దాల సాయి, సూరారం జానీ, కంబాల వెంకటేశ్, కంబాల రాజు, లోకేశ్, ఎం.జానీ, దినేశ్, కల్యాణ్, సాయిచరణ్, సుమన్, ప్రవీణ్, ప్రణయ్, రవి తేజ, దుర్గాప్రసాద్, సుమన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ప్లాట్లు మాకు ఇప్పించండి

● పోలీస్‌స్టేషన్ వద్ద వెంచర్ బాధితుల ఆందోళన

పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వెంచర్ బాధితులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఇప్పించి.. బెదిరింపులకు పాల్పడుతున్న డీవీఆర్ వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ల కొనుగోలుదారులు మంగళవారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వడపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలో 503, 507, 509, 510, 521, 522, 523, 524, 530, 532 సర్వే నంబర్లలోని 14.20 ఎకరాల భూమిలో డీవీఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని వెంకటేశ్వర్‌రావు వెంచర్ చేశారన్నారు. అందులో 121 మందిమి ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఆ భూమిని మర్యాల గ్రామానికి చెందిన ఈదులకంటి దయాకర్‌రెడ్డి దొంగ పట్టా చేయించుకున్నాడని, దానికి రైతుబంధు కూడా వస్తుందని అన్నారు. తాము ప్లాట్ వద్దకు వెళ్లి చూస్తే హద్దు రాళ్లను కూల్చి, చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉన్నదని, దయాకర్‌రెడ్డి అనుచరులు దాడులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో, కలెక్టర్, డీసీపీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. అక్రమంగా పట్టా చేయించుకున్న దయాకర్‌రెడ్డి, డీవీఆర్ వెంచర్ యజమాని వెంకటేశ్వర్‌రావుపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్యా సంతోష్‌నాయక్ మద్దతు తెలిపారు.

కొండపైన వర్తక సంఘం అధ్యక్షుడిగా మాధవులు

అధ్యక్షుడు మాధవులును సన్మానిస్తున్న వర్తక సంఘం కార్యవర్గం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6 : యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం అధ్యక్షుడిగా గడ్డమీది మాధవులు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో గౌరవ సలహాదారులు తడ్క వెంకటేశ్, కైరంకొండ నవీన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొన్నె రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా కీసరి బాలరాజు, వడ్లోజు వెంకటేశ్, గుజ్జు శ్రీను, కోశాధికారిగా గుండ్లపల్లి నర్సింహ, సహాయ కార్యదర్శులుగా గడ్డమీది రాజు, కన్నాయి సుగుణమ్మ, కార్యవర్గ సభ్యులుగా కల్వకుంట్ల శేఖర్, సంతోష్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, జెల్లా భానుచందర్, పబ్బు రామకృష్ణ, జెజుగం శివకుమార్, సిల్వేరు కిశోర్, యేల కంటి మోహన్, బైరగాని ప్రవీణ్, గడ్డమీది దామోదర్, గొర్ల నవీన్, ఇందిర ఎన్నికయ్యారు.

అనంతరం నూతన అధ్యక్షుడు మాధవులును సంఘం కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

గుండెపోటుతో ట్రిపుల్ ఆర్ బాధిత రైతు మృతి

మామిడి నర్సింహారెడ్డి

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని సింగరాయచెర్వు గ్రామానికి చెందిన రీజినల్ రింగ్ రోడ్డు భూబాధిత రైతు మామిడి నర్సింహారెడ్డి (65) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న నర్సింహారెడ్డికి ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామ పరిధిలో వారికి ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో పూర్తిగా పోతున్నది. ఉన్న భూమి మొత్తం కోల్పోతుండటంతో తన కుటుంబం రోడ్డుపాలు అవుతుందని నర్సింహారెడ్డి ఆవేదన చెందాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే మానసిక క్షోభకు గురై సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

మోత్కూరు, ఫిబ్రవరి 6 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. మండలంలోని పాలడుగులో మంగళవారం జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు, ప్రెటోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసరాల ధరలు బాగా పెరిగి పోయాయన్నారు. ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ప్రజలు, మేధావులు బీజేపీ స్వార్థ రాజకీయాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో వి.యాదగిరి, చంద్రయ్య, ప్రభాకర్, సోమరాజు, గంగయ్య, లక్ష్మణ్, సైదులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర నాట్య కళామండలి అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి

దామోదర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర నాట్య కళామండలి అధ్యక్షుడిగా పైళ్ల దామోదర్‌రెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డిని కళాకారులు సత్తయ్య, ఐలయ్య, పద్మారెడ్డి, ఇస్తారి, నర్సయ్య, దశరథగౌడ్, నర్సింహాచారి, ఆగయ్య, స్వామి, రవి సన్మానించారు.

కూరెళ్ల కృషి భావితరాలకు ఆదర్శం

కూరెళ్లను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు

రామన్నపేట, ఫిబ్రవరి 6 : మధుర కవి కూరెళ్ల తన సొంత ఇంటిని 2లక్షల పుస్తకాలతో గ్రంథాలయంగా మార్చి పల్లెపట్టున ఆయన చేస్తున్న కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ పురస్కారం అందుకోనున్న కూరెళ్లను మంగళవారం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కూరెళ్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం, నాయకులు నారాయణరెడ్డి, గోదాసు అంజయ్య, గోవర్ధనాచారి, గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి ఉన్నారు.

ఆధ్యాత్మిక సభలతో మానవ విలువలు పెంపు

● ఆచార్య మసన చెన్నప్ప

మాట్లాడుతున్న మసన చెన్నప్ప

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : ఆధ్యాత్మిక సభలతోనే మానవ విలువలు పెంపొందుతాయని, తల్లిదండ్రులకు మించిన దైవం లేదని ప్రముఖ కవి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. కస్తూరి అంజన్‌దాస్ 19వ ఆరాధనోత్సవం సందర్భంగా మండలంలోని వీరవెల్లి గ్రామంలోని మాతృ, పితృ ధ్యాన మందిరంలో మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాశ్చాత్య పోకడలతో రోజురోజుకూ దిగజారుతున్న మానవీయ విలువలు పెంపొందించడం ఒక్క ఆధ్యాత్మిక సభలతోనే సాధ్యమన్నారు. దేవుడికి ఆకారం లేదని, మనం చేసే మంచి మనుల్లోనే దేవుడున్నాడని తెలిపారు. ఈ వేదాంత సభలో నిర్వాహకులు డాక్టర్ కస్తూరి రాజారాం, సంఘ సేవకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ కస్తూరి యాదగిరి, ఆర్మీ శ్రీనివాస్, సాధువులు సూర్యప్రకాశానందగిరిస్వామి, శ్రీధర ఆచార్య స్వామి, వేదశ్రీ, వేదానందగిరిస్వామి, నిత్యానందగిరిస్వామి, ఆధ్యాత్మిక వేత్తలు సోమ సీతారాములు, డాక్టర్ చెన్న కిష్టయ్య, జర్నలిస్ట్ వేమనకృష్ణ, సదానందం పాల్గొన్నారు.

ఎల్ఎన్ఎస్ బీమా నమోదు చేయించుకోవాలి

ఎల్ఎన్ఎస్ ప్రమాద బీమా పత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ రాజు

రాజాపేట, ఫిబ్రవరి 6 : లక్ష్మీనరసింహస్వామి ప్రమాద బీమాను ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవాలని ఎంపీటీసీ దాచేపల్లి రాజు, బీజేపీ జిల్లా నాయకుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ అన్నారు. భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ప్రత్యేక బీమా నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.150 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాయితీ బాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, జడల శేఖర్‌గౌడ్, కిష్టయ్య పాల్గొన్నారు.

16న కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

● కార్మిక సంఘాల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకుల పిలుపు

సదస్సులో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 6 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మంగళవారం కార్మిక సంఘాల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. 16న అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ, ప్రజాసంఘాలను కలుపుకొని గ్రామాల్లో బంద్ నిర్వహించాలని, మండల కేంద్రాల్లో ర్యాలీలు, ముట్టడులు, రాస్తారోకోలు నిర్వహించాలని తీర్మానించారు. 9న ఆలేరులో, 10న చౌటుప్పల్, 11న యాదగిరిగుట్టలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని సైతం కాలరాస్తూ 12 గంటలు శ్రమదోపిడీ చేసుకునేలా యాజమాన్యాలకు అవకాశం కల్పించిందన్నారు. బీజేపీ విధానాలకు నిరసనగా చేపట్టే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో రైతులు, కార్మికులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణ, ఎండీ ఇమ్రాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గడ్డం నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు రేగు బల నర్సింహ, ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు దాసరి పాండు, గోరేటి రాములు, పద్మ సుదర్శన్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దివీస్ చేయూత

విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న మండల వైద్యాధికారి కాటంరాజు

● మండల వైద్యాధికారి కాటంరాజు

చౌటుప్పల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దివీస్ పరిశ్రమ సహకారం అందిస్తున్నదని మండల వైద్యాధికారి సీహెచ్ కాటంరాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం న